సాక్షి
మహబూబాబాద్

గురువారం । 17 । ఆగస్టు । 2023



శ్రావణం..శుభప్రదం..
నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుంది. నెల రోజుల పాటు దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించనున్నారు. - 8లో▸



వలస జీవులను మింగిన లారీ
లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఆరుగురు వలస జీవులు దుర్మరణం చెందారు. వీరంతా కుటుంబ సభ్యులతో రాజస్తాన్ రాష్ట్రం నుంచి వరంగల్ జిల్లాకు వలస వచ్చారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.1^{0} / 26.3^{0}

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



మహబూబాబాద్: రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం మానుకోట తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెండో ఏఎన్‌ఎంలు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..15 సంవత్సరాలుగా రెండో ఏఎన్‌ఎంలు శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో చేసిన సేవలను గుర్తించి వారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మె నోటీస్ ఇచ్చినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో రెండో ఏఎన్‌ఎంలు అశ్విని, జ్యోతి, సమ్మక్క, నషిమా, కవిత, మాకమ్మ, రాములమ్మ, సునీత, పార్వతి, స్నేహలత, విజయ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కార్డుల మంజూరుకు కృషి



మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల సంక్షేమం, హెల్త్‌కార్డుల మంజూరుకు కృషి చేస్తున్నామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ అన్నారు. మానుకోట మండలశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే హెల్త్ కార్డులు మంజూరు చేపిస్తామన్నారు. పీఆర్సీ కమిటీ వేయించి, ఐఆర్ ఇప్పించేందుకు పీఆర్‌టీయూ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మానుకోట మండల అధ్యక్షుడు క్లెం వెంకట్‌రెడ్డి , ప్రధాన కార్యదర్శి భూక్య రామోజీనాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమరావతి, రాష్ట్ర నాయకులు హల్యానాయక్, కోట కనకయ్య, శ్యామలాదేవి, రమేష్, మండల బాధ్యులు సుజాత, అశోక్, సత్యనారాయణరెడ్డి, నాగేందర్ తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



నెహ్రూసెంటర్: రాష్ట్రంలో ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు నాళ్ల లక్ష్మీనర్సింహరావు అన్నారు. జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో బుధవారం ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో ఆరుశాతం ఉన్న ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ లేకపోవడం బాధాకరమన్నారు. 2018 ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్యవైశ్యులకు రూ.5 వేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని సీఎం ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదన్నారు. ఆర్యవైశ్య నిరుపేద కుటుంబాలకు గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని, అన్ని కులాలకు ఇస్తున్న మాదిరిగా తమకు సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. ర్యాలీలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌరీ శంకర్, రాష్ట్ర కార్యదర్శి ప్రతాపని పాండురంగయ్య, నాయకులు చీదర వీరన్న, వజనపెల్లి అనిల్‌కుమార్, పువ్వాడ హరిప్రసాద్, నాళ్ల వేణుగోపాల్, భువనగిరి గిరిధర్‌గుప్త, మచ్చ సోమయ్య, తల్లాడ వెంకటరామారావు, ప్రతాపని పుల్ల య్య, సాంబమూర్తి, హనుమంతరావు, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

మౌంట్ ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించిన వివేక్

హన్మకొండ అర్బన్: యూరోప్‌లో అత్యంత ఎత్తైన మౌంట్ ఎల్బ్రస్ పర్వతాన్ని ములుగు జిల్లా మంగపేట మండలం వాడాగూడేనికి చెందిన టెక్ మహీంద్ర ఉద్యోగి వాసం వివేక్‌కుమార్ అధిరోహించాడు. రష్యా–జార్జియా సరిహద్దుల్లో ఉండే ఈ పర్వతం సముద్ర మట్టానికి సుమారు 5,642 మీటర్లు(18,510అడుగులు) ఎత్తులో ఉంటుంది. ఇది ప్రపంచంలోని 10వ అత్యంత ప్రముఖ శిఖరంగా పేరుగాంచింది. ఐరోపా, ఆసియా దేశాల్లోనే అత్యధిక ఎత్తులో ఉండే అగ్నిపర్వతం ఈ శిఖరంపై ఉందని చెబుతున్నారు. పంద్రాగస్టు రోజు వివేక్ ఈ అగ్ని పర్వతాన్ని అధిరోహించి భారత జాతీయ జెండా, తెలంగాణ మ్యాప్ ప్రదర్శించాడు.

ఒక్కటయ్యారా ?

కలిసి తిరుగుతున్న మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్

- మానుకోట అసెంబ్లీ సీటుపై ముగ్గురి దృష్టి
- హైదరాబాద్‌లో ఏం మంత్రం వేశారని చర్చ
- టికెట్ ఎవరికి కేటాయించినా గెలుపునకు కృషి చేస్తారా అనేది అనుమానం!



కార్యక్రమంలో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

సాక్షి, మహబూబాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ మానుకోట అసెంబ్లీ నియోజకవర్గంలో గ్రూప్ రాజకీయాలకు కొదువలేదు. నాయకుల మధ్య తరచూ గొడవలు జరగడం, పంచాయితీలు అధిష్టానం వద్దకు వెళ్లిన ఘటనలు ఉన్నాయి. అయితే విచిత్రంగా ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది నాయకుల మధ్య అంతరం తగ్గుతోంది. అసెంబ్లీ టికెట్‌పై కన్నేసిన మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ కవిత, స్థానిక ఎమ్మెల్యే శంకర్ నాయక్ సమష్టిగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇది చూసిన నాయకులు, కార్యకర్తలు ఒకింత ఆశ్చర్యానికి గురవుతున్నారు. కాగా అసెంబ్లీ ఎన్నికల్లో ముగ్గురిలో ఎవరికి టికెట్ కేటాయించినా గెలుపు కోసం సమష్టిగా పని చేస్తారా అనేది చర్చగా మారింది.

సద్దుమణిగిన టికెట్ చర్చ

మానుకోట బీఆర్‌ఎస్ పార్టీలో మొదటి నుంచి వర్గాలు ఉన్నాయి. 2014లో ప్రత్యర్థులైన ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఎంపీ మాలోత్ కవిత తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఒకే పార్టీలో చేరారు. అయితే గత ఎన్నికల్లో మానుకోట టికెట్ కోసం కవిత తీవ్రంగా ప్రయత్నించి భంగపడ్డారు. అనంతరం ఆమెకు మానుకోట ఎంపీ టికెట్ ఇవ్వగా.. గెలుపొందారు. అయితే ఇద్దరు ఒకే పార్టీలో ఉన్నా.. ఫ్లెక్సీలు చించుకోవడం, మైకులు గుంజుకోవడం, ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో చోటుదక్కింది. కాగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టికెట్ వార్ మొదలైంది. మానుకోట టికెట్ కవితకే వస్తుందని ఆమె వర్గం, కాదు కాదు.. సత్యవతి రాథోడ్ పోటీ చేస్తుందని ఎవరికి వారుగా చెప్పుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు వర్గం ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌కు టికెట్ ఇవ్వొద్దని విమర్శలు చేశారు. ఈ పంచాయితీ పార్టీ పెద్దల వద్దకు చేరింది. అయితే 20 రోజులుగా మాత్రం మహబూబాబాద్ టికెట్ విషయంలో ఎవరూ నోరు మెదపడం లేదు. అంతా సద్దుమణిగినట్లు కనిపిస్తుంది.

హైదరాబాద్‌లో ఏం జరిగిందో..

హైదరాబాద్‌లో అధిష్టానం పెద్దల వద్దకు పంచాయితీ చేరడంతో ముగ్గురిని పిలిపించుకుని మాట్లాడారు. అప్పటి నుంచి బీఆర్‌ఎస్ నాయకులందరూ సమన్వయంతో పని చేస్తున్నారు. ఇటీవల పలు సంస్థలు నిర్వహించిన సర్వేల్లో మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయనే ప్రచారం జరిగింది. దీంతో అప్రమత్తమైన గులాబీ సేన.. ముందుగా ఇంటిని చక్కదిద్దుకోవాలనే ఆలోచనకు వచ్చినట్లు సమాచారం. ఈ విషయంపై ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ జిల్లా నాయకులతో సమీక్ష నిర్వహించినట్లు ప్రచారం. టికెట్ ఎవరికి ఇచ్చినా.. కలిసికట్టుగా పనిచేయాలని, జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్ నియోకవర్గాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో అప్పటి నుంచి జిల్లా నాయకులు సమన్వయంతో ఉండడం , ఒకరితో ఒకరు కలిసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ కార్యలయంలో జరిగిన సమీక్షలు, ముఖ్యమంత్రి ఇచ్చిన నిధుల కేటాయింపులో కూడా సయోధ్యకు వచ్చారు. అంతే కాకుండా జిల్లాకు ఇంజనీరింగ్ కళాశాల మంజూరుపై ముఖ్యమంత్రికి కృతజ్ఞత కార్యక్రమం కలిసికట్టుగా నిర్వహించడం చూసి.. వీళ్లు మన జిల్లా నాయకులేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. అయితే టికెట్ కేటాయింపు తర్వాత కూడా ఇలాగే సమన్వయంతో ఉంటారా.. అభ్యర్థి విజయం కోసం పని చేస్తారా అనేది వేచి చూడాల్సిందే.

సీఎం కేసీఆర్‌ను మరోసారి దీవించాలి



బైక్ ర్యాలీలో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, యువత, బీఆర్‌ఎస్ నాయకులు

- మంత్రి సత్యవతిరాథోడ్
- కళాశాలల మంజూరును హర్షిస్తూ బైక్ ర్యాలీ

మహబూబాబాద్: కేసీఆర్ మూడోసారి సీఎం అయితేనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను దీవించాలని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. జిల్లాకు ఇంజనీరింగ్, హార్టికల్చర్ కళాశాల మంజూరును హర్షిస్తూ బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నెహ్రూ సెంటర్‌లో సీఎం కేసీఆర్ భారీ ఫ్లెక్సీకి క్రేన్ సాయంతో గజమాల వేశారు. అనంతరం మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్ నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ బిందు సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. మంత్రి మాట్లాడుతూ.. ఈ విద్యాసంవత్సరం నుంచే ఇంజనీరింగ్ కాలేజీ ప్రారంభమవుతుందన్నారు. ఐదు కోర్సుల్లో 300మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తారని వెల్లడించారు. హార్టికల్చర్ డిగ్రీ కాలేజీతో పాటు ఎస్టీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల కూడా మంజూరైనట్లు చెప్పారు. ఎంబీఏ కాలేజీ కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ.. మానుకోట ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందన్నారు. ఇంజనీరింగ్ కాలేజీ, హార్టికల్చర్ డిగ్రీ కాలేజీ మంజూరుతో జిల్లా విద్యాపరంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన దేవుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. మానుకోట నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని అన్నారు. సీఎం కేసీఆర్‌ను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో మానుకోట మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ సీతామహలక్ష్మి, నాయకులు వెంకన్న, రాజశేఖర్, రంజిత్, మురళీధర్‌రెడ్డి, మురళి, శ్రీను, రఘు, బిక్కునాయక్, బాలాజీనాయక్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల దత్తతకు ముందుకు రావాలి

- కలెక్టర్ శశాంక



విద్యార్థినికి సైకిల్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ శశాంక

కురవి: ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు రావాలని కలెక్టర్ శశాంక అన్నారు. మండలంలోని మోద్గులగూడెం జెడ్పీ హైస్కూల్‌లో గ్రామానికి చెందిన వేమిశెట్టి చంద్రయ్య–ప్రమీల దంపతులు సైకిళ్లను అందజేయగా.. కలెక్టర్ చేతుల మీదుగా 32మంది విద్యార్థినులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతల దంపతులను కలెక్టర్ సన్మానించి మాట్లాడారు. మోద్గులగూడెం పాఠశాల సాధించిన విజయాలను అందరినోట వినడం ఆనందంగా ఉందని, టీచర్లను అభినందించారు. చంద్రయ్య ముందుకొచ్చి చేస్తున్న సేవలు గొప్పవన్నారు. ఆయనను చూసి ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకోవడానికి మరింత మంది ముందుకు రావాలని కోరారు. పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ప్రహరీ నిర్మాణం వారం రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాసాల కవిత, హెచ్‌ఎం బానోత్ శంకర్‌నాయక్, డీఈఓ రామారావు, ఆర్డీఓ అలివేలు, డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ కుంట యాదగిరి, ఎంపీడీఓ సరస్వతి, తహసీల్దార్ రఫీయొద్దీన్, దాతలు ఉప్పల వెంకటేశ్వర్లు, సైన్స్ టీచర్ అప్పారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు మన జన్మ హక్కు..

మహబూబాబాద్: ఓటు హక్కు మన జన్మ హక్కు అని, 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం ఓటు హక్కు, ఇతర అంశాలపై సంబంధిత అధికారులతో ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వీప్ కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు. ఓటు హక్కుపై అవగాహన కోసం విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈనెల 19వ తేదీన జిల్లా కేంద్రంలో 5కే రన్ నిర్వహిస్తామని, ప్రతీ జంక్షన్ వద్ద తాగునీరు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం

- ఏఐసీసీ పరిశీలకుడు, కర్ణాటక మాజీ మంత్రి పరమేశ్వర్ నాయక్
- తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని కౌన్సిలర్ల వాగ్వాదం



సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వర్ నాయక్



నాయకులతో వాగ్వాదం చేస్తున్న కౌన్సిలర్ రాజు

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఏఐసీసీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు, కర్ణాటక రాష్ట్ర మాజీ మంత్రి పరమేశ్వర్ నాయక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్తి గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్, డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పరమేశ్వర్ నాయక్ హాజరై మాట్లాడారు. బూత్, మండల, బ్లాక్ స్థాయిలో ఏజెంట్లు, నేతలను ఎంపిక చేసి పార్టీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి వచ్చిన కార్యకర్తలు, నాయకుల ఉత్సాహాన్ని చూస్తుంటే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రూపుల వల్ల ఇతర పార్టీలకు ఉపయోగం జరుగుతుందన్నారు. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కర్ణాటక ఫలితాలు తెలంగాణలో పునరావృతం కావాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయాలు తెలుసుకొని ఎమ్మెల్యే అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు మానుకోట పార్లమెంట్ పరిధిలోనే ఉండి పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి వివరాలు సేకరిస్తామన్నారు. విబేధాలను పక్కన పెట్టి, టికెట్ ఎవరికి ఇచ్చినా పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. సమావేశం ప్రారంభానికి ముందు ప్రజా గాయకుడు గద్దర్ మృతిపై రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సభ నిర్వహణ నేతలతో కౌన్సిలర్ల వాగ్వాదం..

సమావేశం ప్రారంభంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు పోతురాజు రాజు, భూక్యా శ్రీను మరికొంతమంది సభ నిర్వాహకులతో వాగ్వాదం చేశారు. ఎంతో కష్టపడి పార్టీ అభివృద్ధికి పని చేస్తుంటే తమకు ఎలాంటి గుర్తింపులేదని, అర్హత లేని వారిని వేదిక మీదకు పిలుస్తున్నారని వాపోయారు. ఈ క్రమంలో డీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్‌రెడ్డి, ఏఐసీసీ పరిశీలకుడు పరమేశ్వర్ నాయక్ వారి వద్దకు వచ్చి మాట్లాడి శాంతింపజేసి వేదికపైకి పిలిచారు. సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల పార్టీ నేతలు మురళీనాయక్, రామచంద్రునాయక్, టీపీసీసీ అధికార ప్రతినిధి ఉదయ్ చందర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాధ, అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజయ్య, ఎల్డీఎం నేషనల్ కోఆర్డినేటర్ అనిల్, పార్లమెంట్ కోఆర్డినేటర్ మార్క విజయ్‌కుమార్, మహబూబాబాద్, డోర్నకల్ కోఆర్డినేటర్లు శ్రీనివాస్, రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘సీతారామ’ నీటి కోసం ఉద్యమం



మాట్లాడుతున్న ఎన్డీ నాయకులు సీతారామయ్య

బయ్యారం: ఇల్లెందు నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు నీళ్లు తీసుకొచ్చేందుకు ఉద్యమిస్తామని అఖిలపక్ష పార్టీల నాయకులు అన్నారు. బుధవారం బయ్యారంలోని దొరన్న విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సదస్సులో న్యూడెమోక్రసీలోని ఇరువర్గాలు, కాంగ్రెస్, సీపీఎం, ప్రజాపంథా, టీడీపీ, ప్రతిఘటన పార్టీల నాయకులు పాల్గొని మాట్లాడారు. 2016లో ఇల్లెందు నియోజకవర్గంలోని రోళ్లపాడులో సీతారామ ప్రాజెక్టు నీటిని తీసుకొస్తామని సీఎం కేసీఆర్ శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించారన్నారు. 8 సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు నీటిని తీసుకొచ్చే ప్రయత్నాలు చేయకుండా నూతన డిజైన్ ప్రకారం నియోజకవర్గానికి మొండి చేయి చూపారని వక్తలు పేర్కొన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గంలోని బయ్యారం, గార్ల, ఇల్లెందు, కామేపల్లి, టేకులపల్లి మండలాలకు సీతారామ ప్రాజెక్ట్ నీటిని తీసుకరావాలని కోరారు. లేనియెడల ఉద్యమిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు సీతారామయ్య, వెంకటేశ్వర్లు, ముసలయ్య, రాజన్న, జగ్గన్న, సైదులు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సదరం సర్టిఫికెట్లు అందజేయాలి

నెహ్రూసెంటర్: అర్హులైన దివ్యాంగులందరికీ సదరం సర్టిఫికెట్లు అందజేయాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెపాక శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బుధవారం ఆయన మాట్లాడారు. దివ్యాంగులు ఎక్కువ మంది ఉండడం వల్ల,పూర్తిస్థాయిలో అందరికి సదరం సర్టిఫికెట్లు రాలేదన్నారు. మరోసారి క్యాంపు ఏర్పాటు చేసి అర్హులకు సర్టిఫికెట్లు అందజేయాన్నారు.

సెమిస్టర్ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బుధవారం నిర్వహించిన పీజీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడినట్లు నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపుపరీక్షల నియంత్రణాధికారి జ్యోతి తెలిపారు. హనుమకొండలోని మహిళా పీజీ కళాశాలలో నలుగురు, వరంగల్ ఏఎస్‌ఎం కాలేజీ పరీక్ష కేంద్రంలో ఒకరు మాల్‌ప్రాక్టీస్ చేసినట్లు తెలిపారు.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తోడ్పాటు

కాజీపేట అర్బన్: రాబోయే తరానికి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తోడ్పడుతుందని డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ, ప్రొఫెసర్ సోమశేఖర్ తెలిపారు. నిట్‌లోని సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ (సీఆర్‌ఐఎఫ్)లో భారత ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో స్తుతి (సినర్జిస్టిక్ ట్రెనింగ్ ప్రోగ్రామ్) సౌజన్యంతో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్‌పై వారం రోజుల వర్క్‌షాపును బుధవారం ప్రారంభించారు. ఇంజనీరింగ్ అండ్ బయోమెడికల్ అప్లికేషన్స్‌కు మ్యాట్ ల్యాబ్, పైథాన్‌లను ఉపయోగిస్తూ ఏఐ అండ్ ఎంఎల్‌పై పరిశోధనలు చేపట్టాలని సోమశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీలక్ష్మి, నరసయ్య, ప్రకాశ్‌రావు, ఫరూఖ్ హష్మీ, సుధాకర్, దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 32 మంది పీహెచ్‌డీ స్కాలర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు నిర్వహించాలి



పీహెచ్‌సీ రిజిస్టర్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

కొత్తగూడ: సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారి అంబరీష సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరు కావాలని ఆదేశించారు. ఓపీ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. కళ్ల కలక వ్యాధిపై ప్రజలను చైతన్యం చేయాలని అన్నారు. అనంతరం పీహెచ్‌సీ పరిసరాలు, రిజిస్టర్లను పరిశీలించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, డాక్టర్లు మురళి, శివ, ప్రత్యూష, పీహెచ్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ ఆశయ సాధనకు పాటుపడాలి



వేడుకలో పాల్గొన్న గౌడ కులస్తులు

గూడూరు: బహుజనుల రాజ్యాధికారం కోసం ఉద్యమించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు గౌడ కులస్తులు పాటుపడాలని గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పాపన్నగౌడ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. ఏజెన్సీ ఏరియాల్లో గౌడ సంఘాలు, కులస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించాలని, బీసీబంధులో అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో గోపా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కోశాధికారి కంకటి ముక్తేశ్వర్‌గౌడ్, ప్రతినిధులు గోపగాని మహేందర్‌గౌడ్, పాపన్నగౌడ్ గీతకార్మిక సంఘం వ్యవస్థాపకుడు కామగాని యాదగిరిగౌడ్, గోపా పొదుపు సంఘం మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, కౌండిన్య పొదుపు సంఘం మండల అధ్యక్షుడు కన్న వెంకటేశ్వర్లుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శభాష్ పోలీస్..



జిల్లా కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి గుండా బరువుతో కూడిన మోటార్ బాక్సులను తన రిక్షాలో తీసుకెళ్తున్న ఓ రిక్షావాలాకు అక్కడే విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ సాయం చేశాడు. రిక్షాను వెనుక నుంచి నెట్టుతూ సాయం అందించాడు.
- సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా సతీష్



దంతాలపల్లి: శ్రీశ్రీ కళావేదిక యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని రామానుజపురం గ్రామానికి చెందిన రచయిత, యువ కవి చిర్ర సతీష్ ఎంపికైనట్లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు కట్ల భాగ్యలక్ష్మి మంగళవారం రాత్రి నియామకపత్రం అందించినట్లు తెలిపారు. సతీష్‌ను పలువురు అభినందించారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో 17మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బుధవారం నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ రెండో సంవత్సరం పరీక్షల్లో కాపీయింగ్ చేస్తూ పట్టుబడటంతో 17 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జ్యోతి తెలిపారు. జనగామలోని ఏబీవీ ప్రభుత్వ కళాశాలలో 11మంది, వరంగల్ ఏఎస్‌ఎం డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఆరుగురు విద్యార్థులు కాపీయింగ్ చేస్తూ పట్టుబడగా డీబార్ చేసినట్లు ఆచార్య మల్లారెడ్డి, డాక్టర్ జ్యోతి వెల్లడించారు.

శ్రావణం.. శుభప్రదం..

రోజూ పండుగే, ప్రతీ తిథి దివ్యముహూర్తమే..

- నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- ఉప్పొంగనున్న భక్తిపారవశ్యం
- వేడుకలకు దేవాలయాలు సిద్ధం

శ్రావణం.. శుభప్రదం. ఈ మాసంలో రోజూ పండుగే. ప్రతీ గడియ లక్ష్మీక టాక్షమే. ప్రతీ తిథి దివ్యముహూర్తమే. నెలంతా ఆధ్యాత్మికమే. చెట్టు.. పుట్టా.. గుడి.. రాయి.. ఇలా ప్రతీ చోటు భక్త జనులతో మొక్కులు అందుకుంటాయి. ఎక్కడ చూసినా భక్తి పారవశ్యమే కనిపి స్తుంది. ఏ కార్యం మొదలు పెట్టినా శుభ కరమే. అందుకే శ్రావణమాసానికి ఇం తటి ప్రాముఖ్యం ఉంటుంది. ఈ నేప థ్యంలో నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభంకానుంది. దీనిపై 'సాక్షి' ప్రత్యేక కథనం

హన్మకొండ కల్చరల్ : ఈ సంవత్సరం రెండు శ్రావ ణమాసాలు రావడంతో బుధవారం అధిక శ్రావ ణమాసం ముగిసి నేటి నుంచి (గురువారం) నిజశ్రావణమాసం ప్రారంభమవుతోంది. ఈ నేప థ్యంలో మహిళలు తమ ఇండ్లల్లో రోజూ సుగంధప రిమాళాలతో ధూపదీపాలతో వివిధ రకాల నైవేద్యా లు సమర్పిస్తూ పూజలు జరుపుకుంటారు. కాగా, శ్రావణమాసం ఈ నెల 17వ తేదీన (గురువారం) ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 14వతేదీ (గురు వారం) వరకు ఉంటుంది.

దేవాలయాల్లో ఏర్పాట్లు...

జిల్లాలోని అన్ని దేవాలయాలను అలంకరించారు. వరంగల్ ఎంజీఎం ఎదుట ఉన్న రాజరాజేశ్వరి దేవాలయం, హంటర్‌రోడ్‌లోని సంతోషిమాత ఆలయం, లష్కర్‌బజార్‌లోని సంతోషిమాత ఆలయం, హన్మకొండ హనుమద్గిరి పద్మాక్షి దేవాల యంతో పాటు నగరంలోని పలు వేంకటేశ్వరస్వా మి ఆలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ శ్రావణమాసపూజలు పండితప్రవచనాలు ఏర్పాటు చేశారు.

వేయిస్తంభాల దేవాలయంలో..

రుద్రేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణమాసోత్స వాలలో భాగంగా గురువారం రుద్రేశ్వరశివలిం గానికి సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహిస్తు న్నారు. 21న (సోమవారం) పంచమితిథిరోజు నాగ పూజలు, 31న (గురువారం) రక్షాబంధనం ఉపా కర్మ పూజలు, సెప్టెంబర్ 13న (బుధవారం) మాస శివరాత్రి పూజలు, ఉదయం 11గంటలకు స్వా మివారి కల్యాణం నిర్వహిస్తారు. శ్రావణమాసంలో శివాలయాలలో పూజలు నిర్వహిస్తే సత్ఫలితాలు అందుతాయని ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. అష్టోత్తరనామార్చానలకు రూ. 50, రుద్రాభిషేకానికి రూ. 200, నెలరోజుల అభిషేకం చేయించుకు భక్తులు ఆలయంలోని బుకింగ్ కౌంటర్‌వద్ద రూ. 1,000 చెల్లించి రశీదు పొందాలని ఆలయ ఈఓ వెంకటయ్య తెలిపారు.

ప్రతిరోజూ ప్రత్యేకం...

శ్రావణమాసంలో సోమ, మంగళ, శుక్ర, శనివారాలను పవిత్రమైనవిగా భావిస్తారు. ఈ రోజులలో నియమనిష్టను పాటిస్తారు. శ్రావణ సోమవారం శివుడికి ప్రీతికరమైనరోజు, అలాగే శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యే కపూజలు నిర్వహిస్తారు. మంగళవారం మంగళ గౌరివ్రతాలను చేస్తారు. గురువారం సాయి బాబా ఆలయాల్లో అఖండసాయినామయజ్ఞా లు జరుగుతాయి. శుక్రవారం వరలక్ష్మి వ్రతం జరుపుకున్నవారికి పుణ్యంతో పాటు లక్ష్మీప్రస న్నం కూడా జరుగుతుందని నమ్ముతారు. శనివారాలలో వేంకటేశ్వరస్వామి వారి దేవాల యాలలో ప్రత్యేకపూజలు జరుగుతాయి.

శ్రావణమాస తిథుల ప్రత్యేకత..

రేపు (శుక్రవారం) శ్రావణశుద్ధ విదియరోజు వాసుదేవార్చన, లక్ష్మీపూజలు, అమ్మవార్లకు కుంకుమపూజలు వరలక్ష్మీవ్రతం ఆచరిస్తారు.



శ్రావణమాసంలో లక్ష్మీ అమ్మవారికి, గౌరీశంకరులకు పూజలు (ఫైల్)

కాళేశ్వరం..భక్తిపారవశ్యం

- నేటి నుంచి కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాస వేడుకలు



శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి జోడు లింగాలు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరాలయంలో నేటి(గురువారం) నుంచి శ్రావణమాసం నెల ప్రారంభం కానుంది. ఈ నెల రోజుల పాటు కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంతో పాటు శుభానందదేవి అమ్మవారు, సరస్వతి అమ్మవార్లకు, ఆలయ ప్రాకార దేవత లకు విశేష పూజలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 14 వరకు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈనెల 25న వరలక్ష్మీ వ్రతం సామూహింగా నిర్వహించ నున్నారు. కాగా, నిజశ్రావణమాసంలో పూజలు నిర్వహించడానికి భక్తులు ఇప్పటికే ఈ నెల 30వ తేదీ వరకు అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపారు.

భక్తిభావనతో మనసు ఆహ్లాదకరం



నేను, మా వారు అమెరికాలో ఉం టాం. నా చిన్నప్పటి నుంచి మా అమ్మ వరలక్ష్మి వ్రతం రోజు అమ్మ వారి రూపంతో అలంకరణ చేస్తుంది. శ్రావణమాసమంతా మా ఇంట్లో సువాసనలు వెదజల్లుతాయి. భక్తిభావనతో మనసు ఆహ్లాదకరం, ప్రశాంతగా అనిపిస్తుంది.

- వెగ్గళం నికిష, కాశిబుగ్గ, వరంగల్

భక్తి, విశ్వాసంతో పూజ చేయాలి



శ్రావణమాసం ప్రారంభమవుతుందంటే మా ఇంట్లో సందడి మొదలవుతుంది. అమ్మవారిని భక్తి, విశ్వాసంతో పూజిస్తే మనకు సకల సంపదలను పొందేలా అను గ్రహిస్తుంది. మన పిల్లలకు పండుగల విశిష్టతను తెలియజేస్తూ పూజలలో వారిని భాగస్వాములు చేయాలి.

- గంపా శైలజాశరత్, శ్రీదుర్గా నృత్యాలయం నిర్వాహకురాలు, గోపాల్‌పూర్, హనుమకొండ

వేంకటేశ్వరస్వామి జ్యోతి వ్రతం జరుపుకుంటాం...



శ్రావణమాసంలో మా కోడలు, మా కూతు రుతో కలిసి వరలక్ష్మీవ్రతం చేసుకుంటాం. అలాగే, వేంకటేశ్వరస్వామి జ్యోతి వ్రతం జరుపుకుంటాం.అనంతరం మా ఇంట్లోని పెద్దవారితో ఆశీర్వచనం తీసుకుంటాం. దీని వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది.

-వలబోజు రమాదేవి, గృహిణి, కిషన్‌పురా, హనుమకొండ

తెలంగాణ జీవన ప్రతీక.. బోనాలు

- ఉత్సవాల నిర్వహణకు సిద్ధం

బోనాల పండుగ.. తెలంగాణ జీవన విధా నానికి ప్రతీక.. ఈ పండుగ సందర్భంగా శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలు.. డప్పు చప్పుళ్లతో ఊరు మొత్తం దద్దరిల్లుతుంది. ఈ సమయంలో ప్రతి ఇంటి నుంచి బోనం కదలుతుంది. ఆడపడుచులు బోనం ఎత్తుకుని తన్మయ త్వంతో ర్యాలీగా బయలుదేరి ఆలయానికి చేరుకుంటున్నారు. అనంతరం ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి తనివితీరా బోనం సమర్పిస్తారు. ఈ సంద ర్భంగా పాడిపంటలు, సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని మనసారా వేడుకుం టారు. ఈ నేపథ్యంలో ఈ జాతరకు సమయం వచ్చింది.



బోనం ఎత్తుకున్న మహిళలు(ఫైల్)

కాజీపేట: శ్రావణమాసం ప్రారంభంతో రాష్ట్రంలో బోనాల వేడుకలు ప్రారంభమవుతాయి. ఏటా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ జాతర ఉత్స వాలు ముగిసిన వారం రోజుల్లో జిల్లాలో ఉత్స వాలు ప్రారంభమవుతాయి. అయితే ఈ ఏడాది అధిక శ్రావణ మాసం రావడంతో ఉత్సవాలు నెల రోజుల పాటు ఆలస్యంగా మొదలవుతున్నాయి. ఈ క్రమంలో బుధ, ఆదివారాల్లో పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పండుగను నిర్వహించుకునేం దుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చల్లని తల్లిగా పిలువబడే పోచమ్మ ఆలయం లేని గ్రామం , పట్టణం ఉండదంటే అతిశయోక్తి కాదని చెప్పొచ్చు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 2వే లకు పైగా పోచమ్మ తల్లి ఆలయాలు ఉన్నాయి. నగ రాలు, పట్టణాల్లో రెండు, మూడు కాలనీలకు ఒక పోచమ్మ ఆలయం ఉంటుంది. హిందు సంప్రా దాయాన్ని అనుసరించి శ్రావణ మాసంలో ప్రతి ఇంటి నుంచి పోచమ్మ తల్లికి బోనం సమర్పిస్తారు. కాగా, ట్రైసిటీగా పిలువబడే వరంగల్ నగరంలో కనివిని ఎరుగని తీతిలో ఉత్సవాలు నిర్వహిస్తారు. కాజీపేట, పోచమ్మకుంట, రంగశాయిపేట, మడి కొండ, హనుమకొండ తదితర ప్రాంతాల్లో గొర్రె, పొట్టేళ్లతో ప్రత్యేక రథాలను తయారు చేసి అమ్మ వారిని పుర వీధుల్లో ఊరేగిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి తన్మయం పొందుతారు.

గ్రామ దేవతల అనుగ్రహం కోసం...

జిల్లాల్లో ఆదివారం లేదా బుధవారం జాతర పేర ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఏడుగురు గ్రామదేవతలైనా పోచమ్మ, మైసమ్మ, బాలమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, మహంకాళమ్మ, పెద్దమ్మ వీరికి తోడుగా గ్రామాన్ని కాపాడే పోతురాజు అను గ్రహం కోసం ముత్తయిదువులు బోనాలు సమర్పిం చి పూజలు చేస్తారు. స్థానికులు ఆయా దేవాలయా లను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంక రిస్తారు. ఊరు ఊరంతా ఈ సందడిలో భాగస్వా మ్యం పంచుకుంటుంది.

మహిళ మృతదేహం లభ్యం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఓడవాడ సమీపంలో జంపన్నవాగు, గోదావరి నది కలిసే సంఘం పాయ వద్ద తుప్పల్లో బుధవారం శిథిల మైన ఓ మహిళ మృతదేహం చిక్కుకొని ఉంది. ఈ మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు చూసి పోలీసు లకు సమాచారం ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ రమే ష్, కానిస్టేబుల్ సుధాకర్ ఘటనా స్థలానికి చేరు కొని వివరాలను సేకరించారు. మృతదేహంపై ఉన్న గుర్తులను సేకరించారు. మృతురాలు ఆరెంజ్ కలర్ చీర, బ్లూ కలర్ షెటర్ ధరించి ఉంది. ఆమె వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల వరకు ఉం టుందని పోలీసులు తెలిపారు. ఎరుపు రంగు చద్దరు కూడా ఉందన్నారు. ఈ ఆనవాళ్లను గుర్తుప డితే 8712670090 నంబర్‌లో తమను సంప్రదిం చాలన్నారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఆస్పత్రిలో అగ్నిప్రమాదం..

- సుమారు రూ. 70లక్షల ఆస్తి నష్టం
- సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బంది

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని వేయి స్తంభాలగుడి ఎదుట గల శ్రీనివాస కిడ్నీ సెంటర్‌లో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. అప్రమత్తమైన ఆస్పత్రి సిబ్బంది అగ్నిమాపక శాఖకు సమా చారం అందజే యడంతో వారు హుటాహుటి నా ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదాన్ని ప్రాథమిక దశలోనే అదుపు చేశారు. అగ్నిమాపక శాఖ ఏడీఎఫ్ఓ కె జయపాల్‌రెడ్డి, ఎస్ఎఫ్ఓ ఏ నాగరాజు, ఆస్పత్రి సిబ్బంది కథన ప్రకారం ఆస్పత్రి మొదటి అంతస్తులోని ఆపరేషన్ థియేటర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసు కోవడంతో మిషనరీ పేలి ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. దీంతో చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులు భయాందోళనలకు గురయ్యారు. ఏంజరుగుతుందో తెలుసుకునే లోపే దట్టమైన పొగలు ఆస్పత్రిని కమ్మేసాయి. అప్రమత్తమైన ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి, అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో పాటు సిబ్బంది సాయంతో 12మంది రోగులను కుడా తరలిం చారు. సమాచారం అందుకున్న నిమిషాల వ్యవ ధిలోనే చేరుకున్న ఫైర్ సిబ్బంది ప్రమాదం జరిగిన మొదటి అంతస్తులోకి అద్దాలను పగలగొట్టి మం టలను ఆర్పివేశారు. ఈ ఘటనలో సుమారు రూ. 70 లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఘటనా స్థలిని డీఎఫ్ఓ టి వెంకన్న సందర్శించారు. ఫైర్ సిబ్బంది ఏ శ్రీనివాసరావు, బి సుధాకర్‌రెడ్డి, ఎండీ యాకూబ్, ఏ రూప్‌సింగ్, ఏ రవీందర్‌రెడ్డి, కె వెంక టేశ్వర్లు పాల్గొన్నారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది



వలస జీవులను మింగిన లారీ..

- డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం
- ఆటోను ఈడ్చుకుపోవడంతో పెరిగిన ప్రమాద తీవ్రత
- ఆరుగురి దుర్మరణం.. మరొకరి పరిస్థితి విషమం
- వర్ధన్నపేట మండలం ఇల్లందలో ఘోర రోడ్డు ప్రమాదం



ఆటో నుంచి మృతదేహాలను బయటకు తీస్తున్న స్థానికులు



ఆటో ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు



నుజ్జునుజ్జు అయిన ఆటోను పరిశీలిస్తున్న సీపీ

వరంగల్: వలస జీవులను లారీ మింగేసింది. డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఆరుగురు దుర్మరణం చెం దారు. మరొకరి పరిస్థితి విషమంగా మారింది. దీంతో ఆయా కుటుంబంలో తీరని విషాదం నెల కొంది. వివరాల్లోకి వెళ్తే.. రాజస్థాన్ రాష్ట్రం జైపూ ర్‌కు చెందిన సుమారు పది కుటుంబాలు తేనే సేక రణ కోసం వరంగల్ జిల్లా కేంద్రానికి వచ్చి ఓసిటీ మైదానంలో డేరాలు వేసుకుని నివాసం ఉంటు న్నాయి. నెల రోజుల క్రితం వచ్చిన ఈ వలసజీవు లు నిత్యం ఉదయమే ఇక్కడ నుంచి ఆటోల్లో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్లి తేనె సేకరించి తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. రోజుమాదిరిగానే బుధవారం ఉదయం రెండు కుటుంబాలకు చెందిన ఆరుగురు వ్యక్తులు ఒక ఆటోలో వర్ధన్నపేట, తొర్రూరు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో వర్ధన్నపేట మండలం ఇల్లంద వద్ద లారీ రాంగ్‌రూట్‌లో వచ్చి ఆటోను ఢీకొంది. అలాగే కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. దీంతో ఆటో లో ప్రయాణిస్తున్న ఆరుగురు వ్యక్తుల్లో ఒకే కుటుంబానికి చెందిన కురేరి సురేష్ (43), అతడి కుమారులు అమిత్ కురేరి (23), నితీష్ కుమార్ కురేరి (11), సురేష్ సోదరి కుమారులు (మేన ల్లుళ్లు) రూప్‌చంద్ దామి(33), జలావత్ దామి అలియాస్ జాబీర్ (19)తోపాటు ఆటోడ్రైవర్ నగ రంలోని కరీమాబాద్ ఏసీరెడ్డి నగర్‌కు చెందిన బట్టు శ్రీనివాస్ (42)మృతి చెందారు. మృతుడి కురేరి సురేష్ మరో కుమారుడు అమీర్ ఆస్ప త్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు ప్రీతి, పూజ తెలిపారు.

ఆకలి తీర్చిన వ్యాపారులు..

రెండు కుటుంబాలకు చెందిన ఐదుగురు మృతి చెందారని తెలుసుకున్న లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌కు చెందిన పలువురు వ్యాపారులు చలిం చారు. తమ కుటుంబ సభ్యులు మృతి చెందారని, అందుకే ఉదయం నుంచి ఏమి తినలేదని చెప్ప డంతో భోజనం తయారు చేయించి వారి ఆకలి తీర్చినట్లు వ్యాపారులు బిట్ల కృష్ణ, పాపాని భాస్క ర్, బూర ప్రకాశ్ తెలిపారు.

అమ్మా వస్తున్నా.. అంతలోనే దుర్మరణం

- రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ శ్రీనివాస్ మృతి
- శోకసంద్రంలో కుటుంబం



శ్రీనివాస్ (ఫైల్)


ఖిలా వరంగల్: అమ్మా వస్తున్నా...క లిసి భోజనం చేద్దాం అంటివి.. అంతలోనే మాయమైనవా.. రెం డు రోజులాయే నా చేతి కూడు తినక కొడుకా...తినకుం డానే వెళ్లిపోయినావా .. అంటూ ఆటోడ్రైవర్ బట్టు శ్రీనివాస్ తల్లి రాజమ్మ రోదిస్తుంటే అక్క డున్న వాళ్లంతా కంటితడి పెట్టుకున్నారు. వర్ధ న్నపేట మండలం ఇల్లందలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురిలో ఆటోడ్రైవర్ బట్టు శ్రీనివాస్ కూడా ఉన్నారు. శ్రీనివాస్‌కు పదేళ్ల క్రితం వివాహం జరగగా కుమార్తె, కుమారుడు ఉన్నారు. తొమ్మిది నెలల క్రితం బతుకుదెరువు కోసం భార్య కల్పన, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. ఆర్థిక ఇబ్బందులతో రెం డు నెలల క్రితం భార్య కల్పన తన పిల్లలను వెంటబెట్టుకుని నర్సంపేట ద్వారక పేటలోని పుట్టింటికి వెళ్లిపోగా.. శ్రీనివాస్ మాత్రం పుప్పా లగుట్ట ఏసీరెడ్డినగర్‌లోని తన పెద్దన్న నివాసం ఉండే తల్లి రాజమ్మ ఇంటికి చేరుకున్నాడు. అతను ప్రస్తుతం నాగమయ్య టెంపుల్ సమీప కాలనీలో ఓ గదిని అద్దెకు తీసుకుని అద్దె ఆటో నడిపిస్తున్నాడు. బుధవారం ఉదమే యజమా నికి ఆటో ఇచ్చేసి ఇంటికి వస్తాననుకున్నాడు. ఈ లోపు ఓసిటీలో డేరాలు ఏర్పాటు చేసుకున్న జైపూర్‌కు చెందిన వలస జీవులు అండర్ బ్రిడ్జి వద్ద బట్టు శ్రీనివాస్ ఆటో ఎక్కి తొర్రూరులో దించాలని కోరారు. దీంతో వారిని ఎక్కించు కుని బయలుదేరగా ఇల్లంద వద్ద లారీ ఢీకొంది. దీంతో శ్రీనివాస్ మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో శ్రీనివాస్ సోదరుడు బట్టు కిషన్, వదిన మాలతీ, మృతుడి తల్లి రాజమ్మ, నర్సం పేట నుంచి చేరుకున్న భార్య కల్పన, ఇద్దరు పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీం తో వరంగల్ పుప్పాలగుట్ట ఏసిరెడ్డినగర్‌లో విషాదం నెలకొంది.





విలపిస్తున్న శ్రీనివాస్ తల్లి రాజమ్మ, కుటుంబ సభ్యులు



శ్రీనివాస్ కూతురు, కుమారుడు, భార్య







వలస జీవుల మృతదేహాలు

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రాజేష్ (ఫైల్)

గంగారం : విద్యుదాఘాతంతో ఓ యువ కుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధ వారం గంగారం మండలం కొడిశలమిట్ట గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఈసల రాజేష్ (28) తన పొలం వద్ద మోటార్ ఫీజులు సరిచేస్తుండగా విద్యు దాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూ లాడు. స్థానికులు గమనించి వెంటనే 108లో గంగారం పీహెచ్‌సీకీ తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృ తుడికి భార్య ప్రియాంక, ఐదునెలల పాప ఉంది. మృతుడి కుటుం బీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.

నిందితుల అరెస్ట్

పాలకుర్తి టౌన్: పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామంలో తమ డబ్బు చోరీ చేశారని ఆరోపిస్తూ బాలికలను హింసించిన ఘటనలో నిందితులను అరెస్ట్ చేశామని ఎస్సై శ్రీకాంత్ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన పుస్కూరి మధుకర్‌రావు, ఆయన భార్య సునీత, పుస్కూరి ప్రభాకర్‌రావు ఆయన భార్య రాణి, వీరి సమీప బంధువు లు వెంకటేశ్వర్‌రావు, సీతారామరావును అరెస్టు చేసి కోర్టుకు తరలిం చినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై పోలీసుల దాడి

- కోర్టు ఆవరణలో ఘటన
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



మాట్లాడుతున్న అజయ్

జనగామ: కోర్టు ఆవరణలో ఓ యువకు డిపై పోలీసుల విచక్షణాహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై జిల్లా వ్యాప్తం గా పోలీసులపై విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. బాధితుడు స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పాంనూర్‌కు చెందిన కలకొల అజయ్ కథనం ప్రకారం ఇటీవల నర్మెట మండలంలో తన భూమి కబ్జా చేస్తున్నా రని భార్యాభర్తలు సెల్ఫీ వీడియోతో ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. ఇందులో జేసీబీ ఆపరేటర్ టేకుల రమేష్‌ను నర్మెట పోలీసులు కోర్టులో రిమాండ్ చేస్తున్న క్రమంలో అతడి బావ అజయ్ కేసు విషయమై ఆరా తీశాడు. దీంతో కేసు విషయం అడుగు తారా అంటూ నలుగురు పోలీసులు తనను విచక్షణారహింగా కొట్టారని అజయ్ తెలిపారు. దాడి చేసే క్రమంలో వీడియో తీయగా దానిని డిలీట్ చేయించారన్నారు. ఈ ఘటనపలో కానిస్టేబుళ్లపై జన గామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. ఇదిలా ఉండగా.. జనసేన పార్టీ స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె పృథ్వీ మాట్లాడుతూ కుటుంబ సభ్యుడి రిమాండ్ వివరాలు అడిగితే పోలీసు ఇలా వ్యవహరించడం హేయమన్నారు. ఈ విషయమై నర్మెట సీఐ నాగబాబును వివరణ కోరగా అజయ్‌ని పోలీసులు కొట్టలేదన్నారు. రమేష్‌ను కోర్టులో ప్రొడ్యూస్ చేసేందుకు ఉదయం 7.30 గంటలకు తీసుకు రాగా అజయ్ అక్కడకు న్యూసెన్స్ చేశారన్నారు. పోలీసులు రిమాండ్‌కు సంబంధించి పత్రాలు రాసే క్రమంలో వీడియో తీయగా దీనిని డిలిట్ చేసి వెళ్లి పోవాలని కోరామే తప్ప.. కొట్టినట్లు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు.

అక్క ఆశీర్వాదం కోసం వచ్చి.. తిరిగిరాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఐనవోలు: అక్క ఆశీర్వాదం కోసం వచ్చిన తమ్ముడు రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఈ ఘటన మండలంలోని కొండపర్తి గ్రామంలో జరిగింది. మామునూరుకు చెందిన ఎర్ర భాను ప్రకాష్ (26) మంగళవారం రాత్రి కొండపర్తిలో నివాసమంటున్న తన అక్కాబావ మాదాసు భార్గవి, శ్రీధర్ ఇంటికి వచ్చాడు. బుధవారం సాయంత్రం బైక్‌పై మామునూరుకు వెళ్తున్నాడు. అదే సమయంలో వరంగల్ నుంచి కొండపర్తికి ఆటో వస్తుంది. ఈ క్రమంలో కొండపర్తి గ్రామ చివర మలుపు వద్ద ఎదురెదురుగా ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో భాను ప్రకాష్‌కు తీవ్ర గాయాలుకావడంతో స్థానికులు ఎంజీఎం తరలిం చారు. అయితే భానుప్రకాష్ అప్పటికే మృతిచెం దినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, భాను ప్రకాశ్‌కు గాయత్రితో వివాహం కాగా ఇటీవల కొడుకు జన్మించాడు. మంగళవారం కొడుకుకు 21 రోజు ఫంక్షన్‌ను చేశాడు. మరుసటి రోజు అక్క ఆశీర్వాదం తీసుకోవడం వారి సంప్రదాయం. దీం తో అతను కొండపర్తికి వచ్చినట్లు స్థానికులు తెలి పారు. ఈ ఘటనపై మృతుడి పెద్ద నాన్న కొడుకు భరత్ ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. భాను ప్రకాష్ మామునూరు బెటాలియన్‌లో అవుట్ సోర్సింగ్ కుక్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.



భానుప్రకాష్(ఫైల్)